సాక్షి

నిజామాబాద్

గురువారం । 15 । ఆగస్టు । 2024

I



యూత్ కాంగ్రెస్ ఎన్నికలు

జిల్లా యూత్ కాంగ్రెస్ ఎన్నికలు బుధవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఆన్‌లైన్‌లో ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

- IIIలో ▸



విధుల బహిష్కరణ

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను ఖండిస్తూ న్యాయవాదులు విధులు బహిష్కరించి, నిరసన తెలిపారు.

- IIIలో ▸

గరిష్ఠం/కనిష్ఠం
39.0 /23.5

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఎండతీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

బ్రిటీష్ పాలకులు, రజాకార్లపై
తుపాకీ ఎక్కుపెట్టిన ఇందూరు

- 1857 నాటి ప్రథమ స్వాతంత్య్ర సంగ్రామంలో జిల్లావాసుల పాత్ర
- అటు బ్రిటీష్, ఇటు నిజాం రజాకార్లపై పోరాటం

1857 నాటి మొదటి భారత స్వాతంత్ర్య సమరంలో, నిజాం రజాకార్లపై పోరులో ఇందూరు గడ్డకు ఘనమైన చరిత్ర ఉంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని కౌలాస్ రాజు రాజా దిలోప్‌సింగ్, అప్పటి మరికొందరు రాజులు బ్రిటీష్ సైన్యాన్ని ఎదిరించారు. ఆంధ్రమహాసభ, ఆర్య సమాజం ఆధ్వర్యంలో జిల్లావాసులు రెండు స్వాతంత్ర పోరాటాల్లో పాల్గొని తమ సత్తా చాటారు. – మోర్తాడ్(బాల్కొండ)

- వివరాలు IIలో..

ఆ ఊరంతా దేశభక్తులే !



సరిహద్దులో కాలేవర్ రాజు



సరిహద్దులో జవాన్ గంగాధర్

ఆ ఊరు నిండా దేశభక్తులే.. భరత మాత రక్షణలో ముందుంటారు. మాక్లూర్ మండలం అడవి మామిడిపల్లి నుంచి కాలేవర్ రాజు, జవాన్ గంగాధర్‌లతో పాటు మొత్తం 20 మంది యువకులు సైన్యంలో చేరి సరిహద్దుల్లో దేశ రక్షణకు పహారా కాస్తున్నారు. ఈ గ్రామానికి జై హింద్‌పల్లి అనే మరో మారుపేరు కూడా ఉంది.

- వివరాలు IIలో..



పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీపీ కల్మేశ్వర్



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు



ముస్తాబైన పోలీస్ పరేడ్ గ్రౌండ్



మోర్తాడ్‌లో రజాకార్లపై పోరులో ఉపయోగించిన ఫిరంగి

జెండా పండుగకు ముస్తాబు

స్వాతంత్ర్య దినోత్సవానికి జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానం ముస్తాబైంది. గ్రౌండ్‌లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ గురువారం ఉదయం 10.00 గంటలకు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. –నిజామాబాద్ అర్బన్

న్యూస్‌రీల్

అందుబాటులో ఉంటా

- మున్సిపల్ కమిషనర్ మకరందు

నిజామాబాద్ అర్బన్: మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తానని మున్సిపల్ కమిషనర్ మకరందు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో పనిదినాలలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. మంగళవారం 'సాక్షి' దినపత్రికలో మున్సిపల్ కమిషనర్ ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని వెలువడిన కథనంపై స్పందించారు. నగర పాలక సంస్థలో వివిధ సేవల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలు దరఖాస్తులను నేరుగా పౌర సేవా కేంద్రంలో అందించాలని సూచించారు. అధికారులు ఆయా దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిష్కరించకపోతే తనను కలవాలని సూచించారు. ఏవైన సమస్యలు ఉంటే కార్యాలయం నంబర్ 08462–221001, కమిషనర్ 7815957047 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కమ్మర్‌పల్లి మహిళా సమాఖ్యకు అవార్డు



కమ్మర్‌పల్లి: రాష్ట్ర ఉత్తమ మండల మహిళా సమాఖ్యగా కమ్మర్‌పల్లి సమాఖ్య ఎంపికైంది. రుణాల పంపిణీ, రికవరీ, ఆదాయ అభివృద్ధి కార్యక్రమాల ఏర్పాటు వంటి అంశాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను కమ్మర్‌పల్లి మండలం రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన స్త్రీనిధి 11వ వార్షిక సమావేశంలో ఐకేపీ ఏపీఎం కుంట గంగాధర్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రోజారాణి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డుతో పాటు ప్రశంసా పత్రం అందుకున్నారు.

సీఐల బదిలీలకు బ్రేక్

ఖలీల్‌వాడి: జిల్లాలో సీఐల బదిలీలకు సంబంధించి బుధవారం సాయంత్రం ఉత్తర్వులు వెలువడగా రాత్రి వాటికి బ్రేక్ పడింది. మొదట వెలువడిన ఉత్తర్వుల్లో ఐజీ ఆఫీస్‌కు అటాచ్ ఉన్న రఘుపతిని ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వోగా, ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్ బాబును బోధన్ రూరల్‌కు, బోధన్ రూరల్ సీఐ నరేశ్‌ను ట్రాఫిక్ సీఐగా, ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణను బోధన్ టౌన్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. బోధన్ టౌన్ ఎస్‌హెచ్‌వోగా ఉన్న వీరయ్యను సీసీఆర్‌బీకి, సీసీఆర్‌బీలో పని చేస్తున్న శ్రీనివాస్ రాజును నిజామాబాద్ టౌన్ సీఐగా, టౌన్ సీఐ నరహరి, టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్యను ఐజీ ఆఫీస్‌కు అటాచ్ చేశారు. కాగా వీరిని పాత స్థానాల్లోనే కొనసాగించాలని రాత్రి మళ్లీ ఆదేశించినట్లు సమాచారం.

ముగ్గురు ఎస్సైలకు..

జిల్లాలో ముగ్గురు ఎస్సైల బదిలీలకు బ్రేక్ పడింది. నిజామాబాద్ మూడో టౌన్ ఎస్సై ప్రవీణ్ కుమార్, ముప్కాల్ ఎస్సై భాస్కరచారి, డిచ్‌పల్లి ఎస్సై మహేశ్ రిలీవ్ కావొద్దని ఆదేశించారు.

ధాన్యం రికవరీకి ఆదేశాలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కోటగిరి మండలం ఎత్తొండ సహకార సంఘం ఆధ్వర్యంలోని రైస్ మిల్లుల్లో తగ్గిన ధాన్యం నిల్వలను రికవరీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా సహకార అధికారి శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. సొసైటీకి సంబంధించిన రెండు మిల్లుల్లో ధాన్యం నిల్వలు మాయమైన విషయమై రైతు సంఘం రాష్ట్ర నాయకుడు సోమశేఖర్‌రావు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనరేట్ విచారణ నిర్వహించింది. తనిఖీల్లో ధాన్యం మాయమైనట్లు తేలింది. 2022–23 సీజన్‌కు సంబంధించి ముడి బియ్యం మిల్లులో 2 వేల క్వింటాళ్ల ధాన్యం, బాయిల్డ్ మిల్లులో 2023–24 సీజన్‌కు సంబంధించి 27 వేల క్వింటాళ్ల ధాన్యం కనిపించకుండా పోయింది. ఇందుకు సంబంధించి సీఎంఆర్ సైతం ఇవ్వలేదు. దీంతో మాయమైన ధాన్యాన్ని రికవరీ చేయాలని పౌరసరఫరాల శాఖ కమిషనరేట్ నుంచి కలెక్టర్‌కు లేఖ పంపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సదరు ధాన్యం వెంటనే రికవరీ చేయాలని జిల్లా సహకార అధికారి శ్రీనివాసరావు సొసైటీ చైర్మన్‌కు లేఖ పంపారు.

నేటి నుంచి హెల్మెట్ తప్పనిసరి

ఖలీల్‌వాడి: రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం నుంచి ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి చేశారు. ఈ మేరకు సీపీ కల్మేశ్వర్ ఆదేశాలు జారీ చేశారు. హెల్మెట్ పెట్టుకోకపోతే భారీ జరిమానా వేయనున్నారు.

తప్పించుకుని తిరుగుతూ..

- సస్పెన్షన్ ఉత్తర్వులు తీసుకోకుండా సింహాచలం దోబూచులాట
- నిజామాబాద్‌లో ఆయన భార్యకు ఉత్తర్వులు అందించిన ఆదిలాబాద్ జిల్లా సహకార అధికారి
- మరోవైపు విడతలవారీగా డీసీవో ఖాతాలోకి రూ.30 లక్షలు జమ
- సస్పెన్షన్ ఎత్తివేయించుకునేందుకు మాజీ డీసీవో లాబీయింగ్
- అవినీతిపై ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఫైర్
- సహకారశాఖను భ్రష్టుపట్టించాడంటూ ఎమ్మెల్యే ఆగ్రహం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: భారీ అవినీతి, అక్రమాలతో పాటు సొసైటీ చైర్మన్లను, సీఈవోలను తీవ్రంగా వేధింపులకు గురిచేసిన మాజీ జిల్లా సహకార అధికారి సింహాచలం గురించి 'సాక్షి' వివిధ కోణాల్లో పరిశోధనాత్మక కథనాలు ప్రచురించింది. ఈ నేపథ్యంలో విచారణ చేయించిన ప్రభుత్వం ఎట్టకేలకు సింహాచలంను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ సస్పెన్షన్ ఉత్తర్వులను తీసుకునే విషయంలో సింహాచలం అధికార యంత్రాంగంతో దోబూచులాట ఆడుతుండడం గమనార్హం.

ఈ నెల 9న సస్పెన్షన్ ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేయగా దాన్ని తీసుకోవడం ఇష్టం లేని సింహాచలం కనిపించకుండా వెళ్లాడు. దీంతో చివరకు ఆదిలాబాద్ డీసీవో మోహన్ తన బృందంతో కలిసి నిజామాబాద్‌లోని సింహాచలం ఇంటికి వెళ్లి ఆయన భార్యకు సస్పెన్షన్ ఉత్తర్వులను అందించారు. బదిలీల నేపథ్యంలో సింహాచలం ఇలా ప్రవర్తిస్తుండడం పట్ల ఇతర అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆదిలాబాద్ డీసీసీబీలో ఓఎస్‌డీగా ఉన్న సింహాచలం తనపై సస్పెన్షన్‌ను ఎత్తివేయించుకునేందుకు భారీ స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇతని అవినీతిపై బోధన్

ఊరి చివర కారు ఆపుకుని..

అధికారి అయి ఉండి సెటిల్‌మెంట్ డాన్ మాదిరిగా సింహాచలం వ్యవహరించాడని విమర్శలు ఉన్నాయి. వసూళ్ల వ్యవహారంలో ఇతని శైలి ప్రత్యేకం. డీసీసీబీ పరిధిలో సొసైటీలు ఉన్న మండలాలకు వెళ్లినప్పుడు ఊరిబయట కారులో కూర్చుంటే ఆయా సహకార సంఘాల అధ్యక్షులు లేదా సీఈవో గానీ డబ్బుల కట్టలు తెచ్చి వ్వాల్సిందే. ఆశ్చర్యకరమైన రీతిలో రైస్‌మిల్లర్ల వద్ద సైతం దండుకోవడం గమనార్హం. సొసైటీల నుంచి మిల్లులకు ధాన్యం కేటాయింపుల నేపథ్యంలో, పౌరసరఫరాల శాఖ డీఎం, డీఎస్‌వోలను బైపాస్ చేసి సింహాచలం అంతా తానే అన్నట్లుగా వ్యవహరించాడు. కడ్తా తీసే విషయంలో రైతులను భారీగా దగా చేయడం పట్ల పలువురు రైతులు, సొసైటీ చైర్మన్లు వాపోయారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన సింహాచలం గ్రూప్–2 ద్వారా అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా చేరాడు. రాష్ట్ర విభజన సమయంలో వెళ్లకపోగా రాష్ట్రానికి చెందిన ఉద్యోగులు వ్యతిరేకించినప్పటికీ హైకోర్టు స్టే ద్వారా తెలంగాణలో కొనసాగుతున్నాడు. ఇతని లాబీయింగ్ ఆషామాషీగా లేదు. శ్రీకాకుళం జిల్లాలో ఉపాధ్యాయురాలిగా ఉన్న తన భార్యను సైతం మూడేళ్ల డిప్యుటేషన్ మీద నిజామాబాద్‌కు తీసుకురావడం విశేషం.

రూ.100 కోట్లపైనే అవినీతి

సస్పెన్షన్ ఉత్తర్వులను అందుకునే విషయంలో యంత్రాంగానికి చిక్కకుండా తప్పించుకుని తిరుగుతున్న సింహాచలం మరోవైపు నిజామాబాద్ డీసీవో ఖాతాలో విడతలవారీగా డబ్బులు జమ చేస్తున్నాడు. తాను అవినీతికి పాల్పడలేదని మొదట బుకాయించిన ఇతను మరి డీసీవో ఖాతాలోకి డబ్బులు ఎక్కడ నుంచి తెచ్చిస్తున్నాడని రైతులు అంటున్నారు. ఇప్పటివరకు రూ.30 లక్షల మేర డీసీవో ఖాతాలోకి జమ చేసినట్లు సమాచారం. రాష్ట్రంలో అత్యధిక ధాన్యం ఉత్పత్తి కలిగిన నిజామాబాద్ జిల్లాలో సింహాచలం చేసిన అవినీతికి లెక్కలేకుండా పోయిందని రైతుసంఘాల నాయకులు చెబుతున్నారు. మొత్తం రికార్డులనే ట్యాంపరింగ్ చేసిన సింహాచలం అవినీతి రూ.100 కోట్ల పైనే ఉంటుందని రైతు నాయకులు అంటున్నారు.

ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి గత జనవరిలోనే ఫైర్ కావడంతో పాటు 'సాక్షి' కథనాల మేరకు తగిన చర్యలకు రంగం సిద్ధం చేయించారు. సింహాచలం అవినీతిపై రైతు సంఘాల నేతలు సుంకేట అన్వేష్‌రెడ్డి, సోమశేఖర్ చేసిన ఫిర్యాదులపై విచారణ జరిగేలా చేశారు.

■ 2018 అసెంబ్లీ, 2019 లోక్‌సభ ఎన్నికల్లో సింహాచలం నిధులు నొక్కేశాడని ఫిర్యాదులు ఎన్నికల సంఘానికి వెళ్లాయి. ఓటరు చైతన్య కార్యక్రమంలో భాగంగా ఆటోలు ఏర్పాటు చేయకుండానే చేసినట్లు ఫేక్ వాహనాల నంబర్లు నమోదు చేశాడు. ఆటోల స్థానంలో టిప్పర్లు, లారీలు ఉండడం గమనార్హం. ఈ విషయమై రైతుసంఘం నాయకుడు సోమశేఖర్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలెక్టర్ విచారణ చేయాలని ఈసీ ఆదేశించింది. అయినప్పటికీ విచారణ చేయకుండా సింహాచలం చేసుకున్నాడు. సోమశేఖర్ మరోసారి ఫిర్యాదు చేయడంతో ఈసీ ఆదేశాల మేరకు కలెక్టర్ విచారణ అధికారిగా అదనపు కలెక్టర్‌ను నియమించారు. అయినప్పటికీ విచారణ చేపట్టలేదు.

ఇందూరు బంద్ విజయవంతం



జిల్లా కేంద్రంలో స్వచ్ఛందంగా మూసి ఉంచిన పూసలగల్లీ దుకాణసముదాయాలు

- బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసనగా దుకాణాల మూసివేత

సుభాష్‌నగర్: బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ హిందూ సంఘాల ఐక్యవేదిక బుధవారం చేపట్టిన ఇందూరు నగరం బంద్ విజయవంతమైంది. వ్యాపార సముదాయాలు, పెట్రోల్ బంకులు, హోటళ్లు, సినిమాహాళ్లు, ఇతరత్ర సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. నగరంలోని చాలా వరకు ప్రైవేటు స్కూళ్లు ముందురోజు సెలవును ప్రకటించాయి. ఆర్టీసీ బస్సులు ఉదయం నుంచే రోడ్డెక్కాయి. కాగా బంద్ నేపథ్యంలో వ్యాపారసంస్థలను బలవంతంగా బంద్ చేయించొద్దని హిందూ సంఘాల ఐక్యవేదిక నాయకులకు పోలీసులు ముందస్తుగా నోటీసులు అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

నగరంలో బైక్ ర్యాలీ, పాదయాత్ర

నగరం బంద్ నేపథ్యంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, హిందూ సంఘాల ఐక్యవేదిక నాయకులు నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈక్రమంలో రైల్వేస్టేషన్ వద్ద దుకాణాలను బంద్ చేయిస్తుండగా పోలీసులు వచ్చి బీజేపీ నాయకులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, రోషన్, దొంతుల రవి, హిందూ సంఘాల నాయకులను అరెస్ట్ చేశారు.



నగరంలో బైక్ ర్యాలీ

అనంతరం పూలాంగ్ వద్ద బైక్ ర్యాలీని అడ్డుకోవడంతో పాదయాత్రను చేపట్టారు. పూలాంగ్ నుంచి శివాజీనగర్ వరకు పాదయాత్ర కొనసాగింది. ఈ మార్గంలో వ్యాపార సముదాయాలను మూసేయించారు. శివాజీనగర్ వద్ద పాదయాత్రను పోలీసులు అడ్డుకుని నాయకులు న్యాలం రాజు, నవీన్, దాత్రిక రమేష్, శ్రీకాంత్, తదితరులను అరెస్ట్ చేశారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు.

బంద్‌కు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

ఇందూరు నగరం బంద్ విజయవంతమైందని, అందుకు సహకరించిన ప్రతిఒక్కరికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ధన్యవాదాలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా హిందువులపై అనేక దాడులు జరుగుతున్నాయని, అయినా దేశంలో సెక్యులర్లమని చెప్పుకునే జాతీయ, ప్రాంతీయ పార్టీలు స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. బంద్ శాంతియుతంగా జరుగుతున్నా.. అక్రమ అరెస్టులు చేసి ఇబ్బంది పెట్టడంపై ఎమ్మెల్యే ఆగ్రహించారు. కదం అనిల్, పిల్లి శ్రీకాంత్, నవీన్, దాత్రిక రమేష్, శశి, న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, రోషన్, దొంతుల రవి, ఎర్రం సుధీర్, రాజు, పవన్ పాల్గొన్నారు.



ఏసీపీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

మరింత భద్రత అవసరం

- 'సాక్షి'తో వైద్య విద్యార్థులు

నిజామాబాద్ నాగారం: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్ హత్యాచారం ఘటనపై జిల్లాలో ప్రజలు, వైద్యులు నిరసన తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల, జనరల్ ఆస్పత్రిలో భద్రతపై వైద్య విద్యార్థులను 'సాక్షి' ఆరా తీసింది. భద్రత బాగుంది అంటునే మరింత బందోబస్తు అవసరం అని వారు పేర్కొన్నారు. భద్రతపై పలువురు వైద్య విద్యార్థులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

జీజీహెచ్ ఎదుట జూడాల సమ్మె

నిజామాబాద్ నాగారం: కోల్‌కతాలో వైద్య విద్యార్థిపై అత్యాచారం, హత్యకు నిరసనగా నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జిల్లా జూడాల అధ్యక్షుడు జితిన్, రాష్ట్ర జూనియర్ డాక్టర్ల వైద్య సంఘం అడ్వైజర్ ప్రణయ్, రమ్య, గ్రీష్మ తదితరులు పాల్గొన్నారు.



జీజీహెచ్ ఎదుట నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

రాత్రి 9 దాటితే అనుమతి తప్పనిసరి

– వింద్య, మెడికల్ కాలేజీ విద్యార్థి



వైద్య కళాశాల హాస్టల్ నుంచి అనుమతి లేకుండా బయటకు వెళ్లొద్దు. రాత్రి 9 గంటలు దాటితే అనారోగ్యానికి గురైనా వార్డెన్ అనుమతి తీసుకునే వెళ్లాలి. కుటుంబ సభ్యులు వచ్చినా సెక్యూరిటీ వద్ద వివరాలు నమోదు చేసుకున్నాకే పంపిస్తున్నారు.

పదిలంగా ఉన్నాం

– సుజిత, మెడికల్ కాలేజీ విద్యార్థి



మేము కట్టుదిట్టమైన భద్రత మధ్య ఎంబీబీఎస్ చదువుతున్నాం. కళాశాల, హాస్టల్‌లో ఎటు చూసినా సీసీ కెమెరాలు ఉన్నాయి. భద్రతకు ఎలాంటి ఢోకా లేదు. బయట వ్యక్తులు లోనికి రానీయకుండా సెక్యూరిటీ ఉంది.

సీసీ కెమెరాల నిఘా

– సంతోషిణి, మెడికల్ కాలేజీ విద్యార్థి



మెడికల్ కళాశాలలో నిరంతరం సీసీ కెమెరాల నిఘా ఉంటుంది. అనవసరంగా కళాశాల గేటు నుంచి బయటకు వెళ్లడం కుదరదు. ఎలాంటి దాడులు, అఘాయిత్యాలు జరగకుండా భద్రత మధ్య మా చదువులు కొనసాగుతున్నాయి.

ఎలాంటి ఇబ్బందులు లేవు

– ఐశ్వర్య, మెడికల్ కాలేజీ విద్యార్థి



ప్రస్తుతానికి భద్రత విషయంలో మాకు ఎలాంటి ఇబ్బందులు లేవు. కాలేజీలో ప్రిన్సిపాల్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ పర్యవేక్షణ ఉంటుంది. నిత్యం సెక్యూరిటీ సిబ్బంది నిఘా ఉంటుంది.

మరికొందరు సిబ్బంది అవసరం

– ప్రతిమారాజ్, జీజీహెచ్ సూపరింటెండెంట్

జీజీహెచ్‌లో సుమారు 250 సీసీ కెమెరాలు ఉన్నాయి. ఇంటర్న్‌షిప్ మెడికోలు ఇక్కడే ఉంటారు. వైద్యుల గదుల్లో, రోగుల గదుల్లో, వరండాల్లో సైతం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. సెక్యూరిటీ సిబ్బంది ఉన్నారు. బస్టాండ్ దగ్గరలో ఉండడంతో కాస్త సమస్యలు వస్తున్నాయి. అందుకే మరింత సిబ్బంది అవసరం. ఈ విషయం ఉన్నతాధికారులకు సైతం వివరించాం.

పక్కాగా నిఘా ఉంటుంది

– నాగమోహన్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

మెడికల్ కళాశాలలో 60 సీసీ కెమెరాలు ఉన్నాయి. 15 మంది సెక్యూరిటీ సిబ్బంది ఉన్నారు. ఇందులో ముగ్గురు మహిళలు. లోనికి రావాలంటే కళాశాల గేట్ వద్ద వివరాలు రాయాల్సిందే. మెడికోలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అధికారులు

నిజామాబాద్ అర్బన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ, స్వచ్ఛదనం –పచ్చదనం అంశాలపై ఆమె బుధవారం హైదరాబాద్ నుంచి జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, విషజ్వరాల పరిస్థితి గురించి ఆరా తీశారు. వైద్యారోగ్య శాఖతో పాటు మున్సిపల్, పంచాయతీరాజ్ తదితర శాఖలు కూడా సమన్వయంతో పని చేస్తూ సీజనల్ వ్యాధుల నివారణకు కృషి చేయాలన్నారు. దోమల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా చేపట్టాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లో సీజనల్ వ్యాధుల నివారణకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. డెంగీ కేసులు నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించి ఆదేశించారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరందు, జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ కుమార్, డీఎంహెచ్‌వో రాజశ్రీ పాల్గొన్నారు.

పంట పొలాల్లో పతాకావిష్కరణ


పంట పొలాల్లో జెండాకు వందనం చేస్తున్న రైతు రవీందర్ (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): సైనికులు, రైతులను మన దేశం ఎంత గౌరవిస్తుందో 'జై జవాన్ జై కిసాన్' చాటి చెబుతుంది. దేశం గౌరవించే రైతన్న తనకు దేశంపై ఉన్న ప్రేమను చాటిచెబుతున్నారు. ఏర్గట్ల మండలం తొర్తికి చెందిన రైతు ఎజాప రవీందర్ గత మూడేళ్లుగా స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా తన వ్యవసాయ క్షేత్రంలో తోటి రైతులతో కలిసి జాతీయ జెండాను ఎగురవేస్తున్నారు. రవీందర్ దేశభక్తిని ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు.

బ్రిటీష్ పాలకులు, రజాకార్లపై
తుపాకీ ఎక్కుపెట్టిన ఇందూరు

- 1857 నాటి ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో జిల్లావాసుల పాత్ర
- అటు బ్రిటీష్, ఇటు నిజాం రజాకార్లపై పోరాటం


నిజాం రజాకార్లపై పోరులో ఉపయోగించిన ఫిరంగి

మోర్తాడ్(బాల్కొండ): భారత స్వాతంత్ర్య సమరంలో, నిజాం రజాకార్లపై పోరులో ఇందూరు గడ్డకు ఘనమైన చరిత్ర ఉంది. దేశాన్ని తమ గుప్పిట్లో పెట్టుకున్న బ్రిటీష్ పాలకులపై, నిజాం రజాకార్ల నియంతృత్వంపైన పోరుసల్పిన చరిత్ర ఇందూరుకు సొంతం. 1857 నాటి ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలోనే మన సత్తా ఏమిటో బ్రిటీష్ పాలకులకు చూపించారు. ఎంతో మంది స్వాతంత్ర్య సమరయోధులు పుట్టిన గడ్డగా నిజామాబాద్ జిల్లాకు ఘనమైన చరిత్ర ఉంది. 1857లో మొదటి స్వాతంత్ర్య సంగ్రామం ఆరంభం కాగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని కౌలాస్ రాజు రాజా దిలోప్‌సింగ్ బ్రిటీష్ సైన్యాన్ని ఎదిరించారు. ఫలితంగా రాజా దిలోప్ సింగ్ తన రాజ్యాన్ని కోల్పోయాడు. ఇదే సంగ్రామంలో బ్రిటీష్ సైనికులకు ముచ్చెమటలు పట్టించిన నానా సాహెబ్ పీష్వాకు కుస్తాపురం(శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ముంపునకు గురైన ప్రాంతం) బాలకృష్ణ మహారాజు ఆశ్రయం ఇచ్చాడనే నెపంతో అతన్ని ఇప్పటి నిజామాబాద్ గంజ్ ప్రాంతంలో ఏడు సంవత్సరాల పాటు బంధించినట్లు చరిత్రకారులు పేర్కొంటున్నారు. ఆంధ్రమహాసభ, ఆర్య సమాజం ఆధ్వర్యంలో జిల్లావాసులు రెండు స్వాతంత్ర పోరాటాల్లో పాల్గొని తమ సత్తా చాటారు. గ్రంథాలయ ఉద్యమంలోనూ మనవారు కీలకపాత్ర పోషించి భావితరాలకు స్ఫూర్తి నింపారు. రెండు స్వాతంత్ర్య సమరాల్లో పోరాటం చేసిన ఘనత మన జిల్లాకు సొంతంకావడం విశేషం.

నిజాం పోలీసులతో జెండా ఊరేగింపు


శ్యాంసుందర్‌రెడ్డిని సన్మానిస్తున్న మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ (ఫైల్)

ఆర్మూర్‌టౌన్: రజాకార్లను ఎదురిస్తూ ప్రజలను చైతన్య వంతులను చేసేందుకు 22 మంది యువకులు ఏకమయ్యారు. వారిలో ఒకరు ఆర్మూర్ పట్టణానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు ఏలేటి శ్యాంసుందర్‌రెడ్డి. గ్రామాల్లో తిరుగుతుండగా వేల్పూర్ వద్ద జరుగుతున్న సంతన్నమల్లన్న జాతరలో నిజాం పోలీసులు ఎదురుకాగా, వారిని ఎదిరించి వారితోనే జాతీయ పతాకంతో జాతరలో ఊరేగింపు నిర్వహించారు. అది మనస్సులో పెట్టుకున్న పోలీసులు శ్యాంసుందర్‌రెడ్డి ఆచూకీని గుర్తించి ఆయనతోపాటు ఆయన తండ్రి నారాయణరెడ్డిని మూడు నెలలు జైలులో ఉంచారు. మాఫీనామా పత్రంపై సంతకం చేయాలని బలవంతం చేసినా శ్యాంసుదర్‌రెడ్డి ఒప్పుకోకపోవడంతో మరో ఏడు నెలల జైలు శిక్ష అనుభవించారు. 1947 ఆగస్టు 15వ తేదీన జైలు నుంచి ఆయన విడుదలయ్యారు. శ్యాంసుందర్‌రెడ్డిని పోరాటాన్ని గుర్తించిన భారతప్రభుత్వం తామరపత్రం అందజేసింది. 14 ఏళ్ల క్రితం అప్పటి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ చేతుల మీదుగా తెలంగాణ నుంచి సత్కారం పొందిన ఐదుగురిలో శ్యాంసుందర్‌రెడ్డి ఒకరు.

రజాకార్లపై కర్రలు దూసిన రాజుబాయి


రాజుబాయి, స్వాతంత్ర్య సమరయోధురాలు

మోర్తాడ్(బాల్కొండ): దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 1947 ఆగస్టు 15న శెట్‌పల్లిలో జాతీయ జెండాను ఎగురవేసే సమయంలో రజాకార్లు దా డులు చేయడంతో మండలంలోని శెట్‌పల్లికి చెంది న రాజుబాయి వారిపై కర్రలతో ఎదురు దాడి చేసింది. భర్తతో కలిసి స్వాతంత్ర్య పోరాటం పాల్గొన్న రాజుబాయి ఇప్పటికీ జిల్లా కేంద్రంలో నిర్వహించే వేడుకల్లో పాల్గొంటున్నది. స్వాతంత్ర్య స మరయోధుల ధాటికి తట్టుకోలేక బ్రిటీష్ పాలకులు దేశాన్ని వీడి వెళ్లిపోయిన వార్తను రేడియోలో విని తొలి స్వాతంత్ర్య దినోత్సవం రోజున జెండా ఎగురవేసిన వారిలో తక్కళ్లపల్లి రాజుబాయ్ కీలక పాత్ర పోషించారు. గ్రామ జమీందారుతో కలిసి తన భర్త స్వాతంత్ర్యం కోసం పోరాడితే ఆమె వంట ఇంటికే పరిమితం కాలేదు. తాను కూడా భవిష్యత్ తరాల కోసం భర్త అడుగుజాడల్లో నడిచింది. ఆనాటి జ్ఞాపకాలు తన మదిలో ఇప్పటికీ మెదలుతున్నాయని స్వాతంత్ర్య సమరయోధురాలు గర్వంగా చెబుతోంది.

ఆ ఊరంతా దేశభక్తులే !

- సైన్యంలో 20 మంది యువకులు
- అడవి మామిడిపల్లికి మరో పేరు జైహింద్‌పల్లి


అడవిమామిడిపల్లి ముఖ చిత్రం



సరిహద్దుల్లో డ్యూటీ చేస్తున్న సైనికులు కాలేవర్ రాజు, గంగాధర్

మాక్లూర్: నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం అడవి మామిడిపల్లి గ్రామం మొత్తం దేశభక్తులే.. ఈ గ్రామం నుంచి కాలేవర్ రాజు, జవాన్ గంగాధర్‌లతో పాటు మొత్తం 20 మంది యువకులు సైన్యంలో చేరి సరిహద్దుల్లో దేశ రక్షణకు పహారా కాస్తున్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని గ్రామంలోని ప్రతి యువకుడు సైన్యంలో చేరటానికే ఇష్టపడతారు. యువత నిత్యం వ్యాయామం చేస్తూ శరీర దారుఢ్యం పెంపొందించుకుంటూ మిలిట్రీ సెలక్షన్‌కు పోటీ పడి వెళ్తారంటే వారికున్న దేశభక్తి స్పష్టమవుతోంది. అడవిమామిడిపల్లి జవాన్లకు పుట్టిల్లుగా మారింది. ఈ గ్రామానికి జై హింద్‌పల్లి అనే మరో మారుపేరు కూడా ఉంది.

మా గ్రామంలో నాటి నుంచి దేశభక్తులు



మా గ్రామంలో నాటి నుంచి దేశభక్తులు ఎక్కువగా ఉన్నారు. పాఠశాల స్థాయి నుంచి ప్రారంభం అయ్యే విద్యాభ్యాసంతోపాటు ధర్మం, న్యాయం అనే పదాలతో ప్రతి నిత్యం ఉదయం దేశభక్తిని పెంపొందించే కార్యక్రమాలు జరుగుతాయి. అందుకు గ్రామంలో ప్రతి ఒక్కరి సహకారం ఉంటుంది. మా గ్రామ యువతకు దేశభక్తి నరనరాన పారుకుపోయింది. మా గ్రామంలో ప్రతి యువకుడు సైన్యంలో చేరటానికే ఇష్టపడి సిద్ధమవుతారు.

– గంగోనే సంతోష్, అడవి మామిడిపల్లి గ్రామస్తుడు